## కాలమ్ దాటని కథ



# ఎక్కడుంది న్యాయం?

హైకోర్టు కాంపౌండులో ఆటో రిక్షాలు నిలిచి వున్నాయి. కాలేజీలు విడిచిపెట్టారు. జనం ఇటూ, అటూ హడావిడిగా తిరుగుతున్నారు. హైకోర్టు కేంటీన్ లోకి వెళ్ళి కాఫీ తాగి వచ్చారు లెక్చరర్ మోహనరావు గారు. ఆటో అతను వచ్చాడు పిలవగానే. ఇంతలో ఓ పెద్ద లాయరు వచ్చి ముందుగా ఆటో ఎక్కి కూచు న్నాడు. ఆటో వెళ్ళిపోయింది. ఇంతలో ఇంకో ఆటోని మోహనరావుగారు పిలిచారు. వచ్చాడు. ఈ లోపుగా మరో చిన్న లాయరు వచ్చి దర్జాగా ఎక్కి కూచున్నాడు. అప్పుడు ఆటోవాలా "ఆయన ముందుగా పిలిచారండి. వారినే తీసుకువెళ్ళడం ధర్మం. మీరు దిగిపొండి" అన్నాడు. "అదేమిటి?" అన్నాడు ఆయన.

"న్యాయం అదే కదండీ" అన్నాడు.

ఆ లాయరుగారు మోహనరావుగారితో "డు యునో హు అయామ్ - నేను లాయర్ని తెలుసా" అన్నారు.

"తెలుసండి."

"మీ రెవరండీ!" అని అడిగారు లాయరుగారు.

"నేను లాయర్లను తయారుచేస్తానండీ! ప్రొడ్యూస్ లాయర్స్"

ఇదొక ఘర్షణలా తయారయింది. దగ్గరలో వున్న మిగతా లాయరు స్నేహితులు వచ్చారు. కొంత దూరం లోనే లెక్చరర్ మోహనరావుగారి విద్యార్థులు కూడా చాలా మంది ఈ దృశ్యాన్ని తిలకిస్తున్నారు.


మొత్తానికి జరిగినదంతా వారితో చెప్పారు. అప్పుడు ఆటోవాలా కూడా ధర్మాన్ని మళ్ళీ చెప్పాడు. లాయరు గారు దిగవలసి వచ్చింది. ఆటోవాలా బయలుదేరాడు. బండి కదలబోతుండగా మోహనరావుగారు ఒక్కమాట చెప్పారు —

"ఈ కోర్టు గోడల మధ్యనైనా న్యాయం కాపాడండి, బాబూ!"

*

—డాక్టర్ బాలాంత్రపు
శ్యామలరావు

# మళ్ళీ కన్యాశుల్కం



'కన్యాశుల్కం'లో ఒక్క లుబ్ధావధాన్లు మాత్రమే గురజాడకు "ఎదురు తిరిగి" తన మార్గం తాను చూసుకున్నాడనిపిస్తుంది. అంటే లుబ్ధావధాన్లు తన మార్గాన్ని ఎంచుకోగల పరిస్థితి ఏర్పడిందనాలి. 'లుబ్ధావధాన్లు' అని పేరు పెట్టడంలో గురజాడ ప్రహసన పద్ధతిని అనుసరించినా... లుబ్ధావధాన్లుగా మిగలక పోవడమే ఆ పాత్ర చేసిన 'తిరుగుబాటు'. నిజానికి 'కన్యాశుల్కం' మొత్తం మీద ... ఒంటబట్టిన భావాలను వదిలించుకున్న ఒకే ఒక మనిషి లుబ్ధావధాన్లు. దీన్ని ఆధునిక పరిభాషలోని "వదిలించుకోవడం" (**Unlearning**) అంటారు. ఇది 'విద్యావంతులకు' ఎంతో శ్రమతో కూడుకున్న పని. ఊరికే 'బ్రతుకుతూ' పోయేవారికి 'విద్య' ఎలా సహజంగా సాధ్యమో దాన్ని వదిలించుకోవడం కూడా అంత సులభమే. లుబ్ధావధాన్లు విద్య ... తరతరాల సంప్రదాయాన్నుంచీ, కొద్దో గొప్పో అభ్యాసం నుంచీ లభించింది. అతని జ్ఞాన సంపద మొత్తంగా నరనరానా


## లుబ్ధావధాన్లు

జీర్ణించుకున్నట్టిది. అందుచేత బాల్యవివాహాల నుంచీ ... అన్ని రకాల 'విశ్వాసాల'కూ అంకితమై పోయిన లుబ్ధావధాన్లు పట్ల సానుభూతి చూపించగలం - అప్పుడప్పుడు చిరాకు తెప్పిస్తాడు. అగ్నిహోత్రావధాన్లు, లుబ్ధావధాన్లు... భూస్వామ్య సమాజపు బిడ్డలే. అగ్నిహోత్రావధాన్లుకు "విద్య" మరింత ఎక్కువ కావడం వలన... లుబ్ధావధాన్లు కన్నా ఎక్కువ దెబ్బలు తిన్నప్పటికీ "అవిద్యావంతుడు" కావడానికి సిద్ధపడలేదు. అసలు లుబ్ధావధాన్లుది నూతిలోని కప్ప బతుకు. రామచంద్రపురాగ్రహారంలో రామప్పంతులు మినహా మరెవరితోనూ అతనికి సంబంధాలున్నట్టు కనిపించవు. కట్టు తప్పిన విధవ కూతురుతో రామప్పంతులు సంబంధ మున్నదని స్పష్టంగా తెలిసినప్పటికీ ... తెలియనట్లే ప్రవర్తించడం అతని దౌర్భాగ్యం. భూస్వామ్య వ్యవస్థలో వ్యక్తిత్వం 'పెంపొందడం' అసాధ్యం. పిడచగట్టుకు పోతుంది. చదవేస్తే వున్న మతి పోయిందనే సామెత ఆ వ్యవస్థ నైజం. లుబ్ధావధాన్లుకు రామప్పంతులొకడే 'బాహ్య ప్రపంచాని'కి లింకు. అంతరాంతరాల్లో ఎక్కడో రామప్పంతులు తనకంటె 'విజ్ఞానవంతుడ'నే అనుమానం వున్న కారణాన లుబ్ధావధాన్లు అతన్ని అంటిపెట్టుకుని వుండడం తప్పనిసరి.

అతని ప్రపంచాన్ని మధురవాణి కొంచెం విశాలం చేసిందనిపిస్తుంది. కాని లుబ్ధావదాన్లుకు పెద్ద దిగ్భ్రాంతి కలిగించిన విషయం ఒకటే- సౌజన్యారావు పంతులు. సౌజన్యారావు పంతులు తనకు సహాయపడడానికి సిద్ధపడడం వలన.. లుబ్ధావధాన్లు ప్రపంచం తల్లకిందులై పోయింది. లుబ్ధులకు సహజంగానే ధనాసక్తి లేనివారిని చూస్తే ఆశ్చర్యం, విభ్రాంతి కలుగుతాయి. దానికి తోడు అయాచితంగా సహాయం చేయడం... మరీ పెద్ద షాక్. అందుకే పాత విలువలన్నీ... కూలిపోయాయి.

అతని పాత లోకంలో 'కొత్త పెళ్ళాం పాత మగడు' కలల్లో కనిపిస్తాడు. దయ్యాలు సీసాల్లో బంధించబడతాయి. 'డబ్బు కుమ్మరించిన తర్వాత... పెళ్ళి కొడుక్కు పెళ్ళి కూతురును' ఇచ్చి వేయాలి.

సౌజన్యారావు పంతులు పరిచయంతో అతని ప్రపంచం మరింత విశాలం కావడంతో కూతురి భవిష్యత్తును గురించీ, తన భావి 'బతుకు'ను గురించీ... 'న్యాయమైన' ఆలోచనలు చేస్తాడు. 'కన్యాశుల్కం' నాటకం ఆఖరయ్యే సరికి, అందులోని పాత్రలు, జీవితాలు ఆఖరు కాలేదు. ముఖ్యంగా లుబ్ధావధాన్లు



విషయం తీసుకుందాం. తను పెళ్ళాడింది ఒక పెళ్ళి కూతురును కాదనీ, మహేశమనే బాలకుణ్ణనీ... తెలుసుకున్న లుబ్ధావదాన్లు ప్రపంచం మరింత విస్తృతమౌతుందనీ, అతని 'జ్ఞాన విసర్జన' (**Unlearning**) మరింత పెరుగుతుందనీ ... అతడు మరింత 'ప్రజాస్వామ్యీకరణ' చెందుతాడనీ ... ఆశిస్తే తప్పులేదు.

పశ్చాత్తాపం అనే భావానికీ లుబ్ధావదాన్లు ఆలోచనలకూ సంబంధలేదు. పశ్చాత్తాపం... పాపం చేసామనే దిగులు నుంచి వస్తుంది. లుబ్ధావధాన్లు నూతన జ్ఞానం సంక్రమించినందువల్ల పునరాలోచనలో పడ్డాడు. పునరాలోచన ప్రజాస్వామ్య సమాజానికి చెందింది. పశ్చాత్తాపం భూస్వామ్య సమాజపు శిక్ష. పశ్చాత్తాపం ప్రకటించడానికి విశ్వాసంతో పనిలేదు. అధికుని వద్ద తలవంచితే చాలు. నిజమైన పశ్చాత్తాపం - **True Repentance** - (గిరీశం సౌజన్యంతో) అనే మాటకు అర్థం, పరమార్థం ప్రజాస్వామ్య సమాజంలోనే లభ్యమౌతాయి. దానికి పూర్వరంగం లుబ్ధావధాన్లు వ్యక్తం చేసాడు. లుబ్ధావధాన్లు కథానాయకుడని అనుకున్నవారూ లేక పోలేదు. కాని 'కన్యాశుల్కం'లో సమాజం, సామాజిక చలన సూత్రాలూ... రధిక, సారధి పాత్రలు వహించాయి.

— హరి